క్లుప్తంగా

మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.20కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని పలు సమస్యలపై అసెంబ్లీ సమావేశాల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డిని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలవగా సీఎం రేవంత్‌రెడ్డి సీఎం ప్రత్యేక నిధుల నుంచి రూ.20కోట్లు మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులతో పాటు అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండల కేంద్రంలోని కొమ్ముగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఊకె రామయ్య ను ఆదివారం ఆయన నివాసంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, జిల్లా, మండల కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కె.ఖదీర్, ఎంపీటీసీ ఏనిక రవి, కాంగ్రెస్ నాయకులు బూరెడ్డి వెంకటరెడ్డి, పర్వత నరేష్ పాల్గొన్నారు.

సభకు తరలిన శ్రేణులు

దమ్మపేట: ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీ సభలకు ఆ పార్టీల శ్రేణులు మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. ఆదివారం మండలంలోని జగ్గారం, పార్కలగండి, జమేదారుబంజర, లింగాలపల్లి, గండుగులపల్లి, మొండివర్రె, దమ్మపేట గ్రామాల నుండి (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో ఖమ్మం సభకు వాహనాల్లో వెళ్లారు. సభకు పార్టీ శ్రేణుల తరలి వెళ్లే వాహనాలను, పార్టీ జిల్లా నాయకులు అమర్లపూడి రాము జెండా ఊపి ప్రారంభించారు.

కేంద్రం చేయూత

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తులు చేసుకునే వారిని ప్రోత్సహించే విధంగా విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేయూతను అందజేస్తుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో ఆదివారం జరిగిన బీసీ సామాజిక సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 18 రకాలకు చెందిన కుల వృత్తులు చేసుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రూ.1లక్ష వరకు రుణం పొందే విధంగా వెసులుబాటు కల్పించిందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు కుంజా ధర్మరావు, మండల అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్‌రావు, చెల్లుబోయిన వెంకన్న, శ్రీనివాస్, కేశవ్, వెంకటేశ్వర్లు, నిఖిల్, హరీష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతర

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోగల శ్రీ కట్టమైసమ్మ తల్లి వార్షిక జాతర ఉత్సవాలు ఆదివారం రాత్రితో ఘనంగా ముగిసాయి. అమ్మవారికి వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే అమ్మవారి విగ్రహాన్ని మంగళవాయిద్యాలతో కాళికా నృత్యాలు, గరగ నృత్యాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. పురవీధుల్లోకి ఊరేగింపుగా వచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని, కానుకలు అందించారు. అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, చందా లక్ష్మీనర్సయ్య, కుమారస్వామి, వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

కాలంచెల్లిన సిద్ధాంతాలు వీడండి

ములకలపల్లి: మావోయిస్టులు కాలంచెల్లిన సిద్ధాంతాలు వదిలి, జనజీవన స్రవంతిలోని రావాలని ఎస్సై రాజమౌళి పిలుపునిచ్చారు. మండలవ్యాప్తంగా ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బ్యానర్లను ఏర్పాటు చేశారు. మీ కుటుంబం ఎదురుచూస్తోంది .. మీ ఊరు రమ్మంటోంది.. మీస్వేచ్ఛకు, అభివృద్ధికి తెలంగాణా ప్రభుత్వం భరోసా అంటూ ఆ బ్యానర్లలో ముద్రింబడి ఉంది.

ఎమ్మెల్యేకు సన్మానం

అశ్వాపురం: అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుమ్మలచెరువు మాజీ సర్పంచ్ వంకా సత్యనారాయణ, వెంకటాపురం మాజీ ఉపసర్పంచ్ అంకుష్ ఆలీ, నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ

చర్లరూరల్: చర్ల మండలంలోని నాయకుల కొత్తూరు గ్రామంలో ఆదివారం ధర్మజాగరణ సంస్థ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందు రోజు శనివారం గ్రామదేవతలను పూజించిన గ్రామస్తులు ఆంజనేయస్వామి విగ్రహాన్ని పవిత్ర తాలిపేరు నదిలో స్నానమాచరించి గ్రామంలో ప్రతిష్ఠించారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతం అయింది. ఆయా ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాలలోని 0–5 సంవత్సరాల పిల్లలకు వైద్య సిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమాలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ.. నిండు జీవితానికి పల్స్ పోలియో రెండు చుక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని సూచించారు. కాగా, పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు నేడు, రేపు ఇళ్లకు వెళ్లి వేయనున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



మణుగూరురూరల్: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాచలంఅర్బన్: పోలియో చుక్కలను వేస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ



చంద్రుగొండ: పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పార్వతి



అన్నపురెడ్డిపల్లి: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ సున్నం లలిత



చర్లరూరల్: ఎంపీపీ గీద కోదండ రామయ్య ఆధ్వర్యంలో..



బూర్గంపాడు: లక్ష్మీపురంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత..



దుమ్ముగూడెం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సీతమ్మ



కరకగూడెం: ఓ చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ రేగా కాళిక



మణుగూరురూరల్: ఎంపీపీ విజయకుమారి ఆధ్వర్యంలో..



గుండాలలో..



అశ్వాపురం: ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యంలో..

ఆశ్రమ పాఠశాలలో తనిఖీ



కరకగూడెం: హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగప్రసాద్

కరకగూడెం: మండల పరిధిలోని చిరుమళ్ళ ఆశ్రమ పాఠశాలను ఆదివారం కరకగూడెం తహసీల్దార్ పి.నాగప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.అంతేకాకుండా విద్యార్థులకు వండిన వంటలను పరిశీలించారు.ఆహార ధాన్యాలు, రికార్డులు మరియు పారిశుద్ధ్యం నిర్వాహణను తనిఖీ చేశారు. మెనూ సరిగా పాటించకపోవడం, నాణ్యత లేని సరుకులతో విద్యార్థులకు ఆహారం ఎలా పెడుతున్నారని సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 220 మంది విద్యార్థులు ఉండవల్సి ఉండగా కేవలం 120 విద్యార్థులు ఉండటంతో మిగతా 100 మంది ఎక్కడని ఆరాతీశారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ షేక్ హుస్సేన్, వార్డెన్ సంపత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి పగిడిద్దరాజు జాతర

గుండాల: మేడారం సమ్మక్క భర్త, అరెం వంశీయుడైన పగిడిద్దరాజు జాతర ఈ నెల 6వ తేదీ నుంచి యాపలగడ్డ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు అరెం వంశీయులు తెలిపారు. జాతరకు సంబంధించి ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి రోజు 6న బుధవారం పగిడిద్ద రాజును గుట్టనుంచి దేవతలను తీసుకువస్తారు. అదే రోజు రాత్రి ఎదురిళ్ల కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. రెండో రోజు 7న గురువారం వనం (సమ్మక్క దేవత) గుట్ట నుంచి తీసుకరావడంతో నిండు జాతన మొదలౌతుందన్నారు. రాత్రి గంగాస్నానం, నాగవెల్లి నిర్వహిస్తారు, మూడో రోజు 8న శుక్రవారం భక్తులు మొక్కులు తీర్చుకోడానికి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ మూడు రోజుల పాటు జాతర అత్యంత భక్తి శ్రద్ధలతో, గిరిజన సాంప్రదాయ పద్ధతిన నిర్వహిస్తామన్నారు. ప్రతీ ఏడాది మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర అనంతరం ఇక్కడ పగిడిద్దరాజు–సమ్మక్క జాతర యాపలగడ్డలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో అప్పయ్య, ఇద్దయ్య, బుచ్చయ్య, సమ్మయ్య, కాంతారావు, రామారావు, బస్వయ్య, నాగయ్య, నరేష్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉపాధి అవకాశాలు



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: యువత క్రీడల్లో రాణించడంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుచుకోవచ్చని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఏజన్సీ యువత ఇటువంటి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్లలో రాణించి జాతీయ స్థాయిలో అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఆయన సూచిచారు. కార్యక్రమంలో టోర్నమెంట్ వ్యవస్థాపకులు పాలమూరి బసవ రాజు, కాపుల శ్రీను, అలీమ్, మణి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాలకు చెందిన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లతో పాటు చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన ఉంజుపల్లిరోడ్, తాలిపేరు ప్రాజెక్టు, పెద మిడిసిలేరుక్రాస్‌రోడ్, కుర్నపల్లి రోడ్‌లలో మోహరించిన పోలీసులు వచ్చిపోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు.

ఈ తనిఖీలలో అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకొని విచారించి విడిచిపెట్టారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డిలు తనిఖీలను కొనసాగించగా, సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

లాప్రోస్కోపీ సేవలు అభినందనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

చర్లరూరల్: చర్ల ఏజన్సీ ఏరియాలో భద్రాచలం నేతాజీ హాస్పిటల్ వారి అత్యాధునిక లాప్రోస్కోపీ సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత అన్నారు. చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎంపీపీ కోదండ రామయ్య ప్రారంభించారు. భద్రాచలం పట్టణంలో అధునాతన పద్ధతిలో లాప్రోస్కోపీ వైద్యసేవలు, శ్వాసకోస వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు.. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా గుండెకు సంబంధించిన ఈసీజీ, హెచ్‌బీ రక్త పరిమాణ శాతం, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. నేతాజీ హాస్పిటల్ ఛాతీ వైద్య నిపుణులు ఎస్.జగదీష్, డాక్టర్ సుకన్యరెడ్డిలు మాట్లాడుతూ.. చర్లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు నరసింహారెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

'పది' ప్రశ్నాపత్రాలు వచ్చేశాయి

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే పదోవ తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు ఆదివారం అశ్వారావుపేటకు చేరాయి. ఈ మేరకు మొదటి సెట్టు ప్రశ్నా పత్రాలను రూట్ ఆఫీసర్, ఎంఈఓ కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో తీసుకొని రాగా, వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్ర పరిచారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారిణి హరిత, ప్రసాద్, శెహనాజ్, వెంకయ్య, శ్రీనివాసరావు, కేఆర్‌సీ ప్రసాద్, సీహెచ్.నరసింహారావు, కృష్ణారావు, హరినాథ్, పద్దం రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై వివరిస్తున్న తుక్కాని శ్రీనివాసరెడ్డి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు పూర్తి అయ్యే వరకు పాఠశాల పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో ప్రతి రోజూ అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధతపై వివరించారు. ఆయన సతీమణి, తెలుగు ఉపాధ్యాయురాలు కవిత విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేసి తెలుగు పరీక్షలో మెలుకువలను వివరించారు. పూర్వ విద్యార్థులు తుక్కాని శ్రీనివాస రెడ్డి, రవీంద్రాచారి, గొడుగు వెంకన్న, హెచ్‌ఎం గోపి, ఉపాధ్యాయురాలు అనురాధ పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నూతన సీఐగా జితేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక సీఐ కరుణాకర్‌ను ఇటీవతే ఉన్నతాధికారులు బదిలీ చేయగా.. ఆయన స్థానంలో ఖమ్మం జిల్లా కుసుమంచి సీఐగా పని చేస్తున్న జితేందర్ రెడ్డిను నియమించిన సంగతి తెలిసిందే. దాంతో ఆయన ఇక్కడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణను ఆదివారం క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అదే విధంగా విధుల్లో చేరిన సీఐను స్థానిక ఎస్సైలు శ్రీరాముల శ్రీను, శివరామకృష్ణతోపాటు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని తాతగుడి చిన్న హైస్కూల్‌లో 1983–84లో 7వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళం పేరిట పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఉపాధి కొరకు వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డవారంతా 40 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరారు. రోజంతా పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధాయులతో పాటు ప్రస్తుతం పాఠశాల హెచ్‌ఎమ్‌గా పనిచేస్తున్న కారం పాపయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శశి, షఫీ, సురేష్‌కుమార్, శంకర్, విశ్వనాథ్, లక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'తో పేదలకు లబ్ధి



బూర్గంపాడు: జీరో బిల్లులు అందిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



ములకలపల్లి: జగన్నాథపురంలో జీరో బిల్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: ఆరు గ్యారెంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. మండలంలోని వినాయకపురం గ్రామంలో ఆదివారం ఓ లబ్ధిదారుడి నివాసానికి వెళ్లి స్వయంగా ఆయన చేతుల మీదుగానే జీరో బిల్లును తీసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గృహ అవసరాలకు విద్యుత్ వినియోగించే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ద్వారా ఆర్థిక భారం తగ్గి ఎంతో లబ్ధి చేకురుతుందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఈ పథకం కింద జీరో బిల్లు అందిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహ అవసరాలకు ఉచిత విద్యుత్‌ను అందించడం సంతోకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, శ్రీను పాల్గొన్నారు.

ములకలపల్లి: ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రతీ హామీని నెరవేర్చి తీరుతామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలపరిధిలోని జగన్నాథపురం. పూసుగూడెంలో గ్రామాల్లో ఆదివారం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా లబ్దిదారులకు జీరో బిల్లు అందజేశారు. అనంతరం పాగళ్లపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ సీనియర్‌నాయకలు పాలకుర్తి రత్నభూషణాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రబాకర్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనర్సింహారావు, గాడి తిరుపతిరెడ్డి, రవి, రాజేశ్ కటికనేని ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణకు పరామర్శ

మండలపరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన వరికూటి కృష్ణను ఎమ్మెలే జారే ఆదినారాయణ పరామర్శించారు. కృష్ణ ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకోగా, ఆదివారం ఇంటికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సీఎంఆర్‌ఎఫ్ అందిస్తానని భరోసా ఇచ్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, ఎంపీటీసీలు తాటి తులసి, సున్నం సునిత, మాజీ సర్పంచ్ కారం సుధీర్, గాడి తిరుపతిరెడ్డి, పామర్తి కృష్ణ, రామాచారి, శనగపాటి రవి. సురభి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: అర్హులందరికి గృహాజ్యోతి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మోరంపల్లిబంజర గ్రామంలో ఆదివారం గృహాజ్యోతి పథకంలో భాగంగా జీరో విద్యుత్ బిల్లులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు తెల్లరేషన్ కార్డు ఉంటే గృహజ్యోతి పథకంలో జీరో విద్యుత్ బిల్లులు వర్తిస్తాయన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇళ్ల వద్ద మీటర్ రీడింగ్‌లు తీసి అర్హులకు జీరో బిల్లులు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు జీరో బిల్లు అందజేత

భద్రాచలంఅర్బన్: పట్టణంలో గృహజ్యోతి లబ్ధిదారులకు భద్రాచలం విద్యుత్ శాఖ ఏడీఈ వేణు, ఏఈ రాజారావు, సిబ్బందితో కలిసి ఆదివారం జీరో బిల్లులను అందించారు. ఈ సందర్భంగా ఏడీఈ వేణు మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణంలో జీరో బిల్లులు చెల్లించే పనులు తమ సిబ్బంది చేపట్టారని తెలిపారు. గడిచిన రెండు రోజుల నుంచి 150 మంది గృహ జ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లు అందించినట్లు తెలిపారు. కాగా జీరో బిల్లులు రాని వారు భద్రాచలం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో తమ ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, రేషన్ కార్డు జిరాక్సులు అందించాలని, ఆయా కార్యాలయంలో అందజేసే రసీదును తమ కార్యాలయంలో అందజేయాలని ఏడీఈ వేణు తెలిపారు.